

ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి
ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలుగా నిర్ణయించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లాలో సోమవారం బస్సుయాత్ర సాగింది. 8లో▸



గిట్టుబాటు అంతంతే..!
సన్నరకం వరి ధాన్యం పండించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. ఈసారి బోనస్ ప్రకటించినా గిట్టుబాటు కావడం లేదు. నిబంధనలతో సతమతం అవుతున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
27.0 / 11.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫాం



చిన్నారులతో కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ప్రభుత్వం యూనిఫాం అందజేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్, మంచిర్యాల సీడీపీవో విజయలక్ష్మిలతో కలిసి పిల్లలకు యూనిఫాంలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని 319 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,810 మంది బాలికలు, 1,827 బాలురు హాజరవుతున్నారని, ప్రభుత్వం నుంచి రెండు దశల్లో రెండు రకాల దుస్తులను ప్రతీ ఒక్కరికి రెండు జతల చొప్పున తయారీకి 5,059 మీటర్ల ఎరుపు రంగు, 1,841 మీటర్ల తెలుపు రంగు, 2,612 మీటర్ల నీలం రంగు వస్త్రాలను అందజేసిందని పేర్కొన్నారు. బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట, మంచిర్యాల ప్రాజెక్టుల పరిధిలో 319 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలకు యూనిఫాంలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు పాల్గొన్నారు.

ప్రజలతో పోలీసులు మమేకం కావాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్



ఏఆర్ అధికారులకు సీపీ సూచనలు

నెన్నెల: ప్రజలతో పోలీసులు మమేకమై ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన నెన్నెల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్రైం రికార్డులు, కేసుల ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పల్లెనిద్ర, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు చేపట్టాలని, అప్పుడే ప్రజలతో సత్సంబంధాలు పెరుగుతాయని తెలిపారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు, సానుభూతిపరులపై బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, నెన్నెల ఎస్సై ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ పోలీసు హెడ్‌క్వార్టర్ సందర్శన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఆర్మ్‌డ్ రిజర్వుడ్ పోలీసు హెడ్‌క్వార్టర్‌ను రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్‌తో కలిసి గౌరవ వందనం స్వీకరించారు. ఆర్మ్‌డ్ హెడ్‌క్వార్టర్స్, ఆర్ఐ కార్యాలయాలు పరిశీలించారు. అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, ఆర్ఐ శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: సీఎం కప్–2024 జిల్లా స్థాయి పోటీలు మంగళవారం నుంచి మంచిర్యాల ఉన్నత పాఠశాల(బాలుర) మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజ్‌వీర్ ఒక ప్రకటనలో తెలిపారు. 17న వాలీబాల్, బాస్కెట్‌బాల్, నెట్‌బాల్, యోగ, 18న కబడ్డీ, బాక్సింగ్, తైక్వాండో, కిక్ బాక్సింగ్, 19న ఉషోదయ ఉన్నత పాఠశాలలో ఖోఖో, రెజ్లింగ్, బేస్‌బాల్, చెస్, సెవన్‌హిల్స్ పాఠశాలలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలు, 20న కరాటే, జూడో, హ్యాండ్‌బాల్, ఉషూ, 21న హైటెక్ సిటీ క్లబ్‌లో బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ ఇతర క్రీడలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

హెడ్‌మాస్టర్‌కు ఏడాది జైలు

కాసిపేట: ప్రభుత్వ విధుల్లో అశ్రద్ధ, మోసం చేసిన హెడ్‌మాస్టర్‌కు ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బెల్లంపల్లి కోర్టు జడ్జి ముకేష్ సోమవారం తీర్పునిచ్చారు. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసిపేట మండలం రేగులగూడ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రొడ్డ గోపాల్ పాఠశాలలో 46మంది విద్యార్థులు ఉండగా.. 136 మంది ఉన్నట్లు నమోదు చేశారు. తప్పుడు రికార్డులతో ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తూ వాడుకున్నాడు. 2013లో అప్పటి ఐటీడీఏ పీవో నివాస్ దేవాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఎస్సై జవ్వాజి సురేష్ చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎస్సై ఆంజనేయులు, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా.. బెల్లంపల్లి కోర్టు జడ్జి ముకేష్ విచారణ జరిపారు. నేరం రుజువు కావడంతో గోపాల్‌కు ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు.

ఆ మిల్లులకే ట్యాగింగ్



మిల్లులోని బియ్యం బస్తాలు

- 'సీఎంఆర్' కేటాయింపులో అనుమానాలు
- కేసుల నమోదు, రికవరీలోనూ పక్షపాతం
- బకాయిలున్న అన్నింటిపై చర్యల్లేవనే విమర్శలు
- ఇప్పటి వరకు 21మిల్లులకు సీఎంఆర్‌కు ఓకే

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ధాన్యం తీసుకుని సకాలంలో బియ్యం ఇవ్వని మిల్లులపై పౌరసరఫరాల శాఖ అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్) ఇవ్వని మిల్లర్లపై ఆర్‌ఆర్ యాక్టు, క్రిమినల్ కేసులు నమోదు చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఇటీవల జిల్లాలో ఏడు మిల్లులపై చర్యలు తీసుకున్నారు. గత అక్టోబర్‌లో మొదట రెండింటిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. జిల్లాలో 2019 నుంచే మిల్లర్లు బియ్యం బకాయిలు ఉండగా, ఒక్కొక్కరిపై చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గత కొద్దిరోజులుగా జరిమానాలు, కేసులతో కొందరు బియ్యం అప్పగిస్తున్నారు. కొంతమంది మిల్లర్లపై మాత్రమే చర్యలు తీసుకుంటూ మరికొందరిపై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బకాయిలు ఉన్న దాదాపు 29మిల్లుల్లో అన్నింటిపైనా ఒకే తీరుగా చర్యలు తీసుకోలేదని వాదనలు వినిపిస్తున్నాయి.

ఇటీవల కేసులు నమోదైన మిల్లులు

హనుమాన్ అగ్రో ఇండస్, మంచిర్యాల
దుర్గ ఇండస్ట్రీస్, నర్సింగాపూర్
బీఎస్‌వై రా రైస్‌మిల్లు, ముదిగుంట
సోమేశ్వర రైస్‌మిల్లు, ఆస్నాద్
శ్రీ రాజరాజేశ్వర మాడ్రన్ రైస్‌మిల్లు, కత్తెరశాల
శ్రీ వెంకటరమణ అగ్రో ఇండస్ట్రీస్, కోటపల్లి
వాసవిమాత మాడ్రన్ రైస్‌మిల్, రేచిని

ఈ సీజన్‌లో మిల్లులకు అప్పగించిన ధాన్యం 30633మెట్రిక్ టన్నులు

ఆర్‌ఆర్ యాక్టు, క్రిమినల్ కేసులు

సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లర్లపై ఆర్‌ఆర్(రెవెన్యూ రికవరీ) యాక్టు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో బకాయిలు ఉన్న మిల్లర్లు బియ్యం అప్పగిస్తున్నారు. ఇందులో కొందరికి మినహాయింపులు ఇస్తూ.. మరికొందరు మాత్రం ఒత్తిడి తెస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో రా రైస్‌మిల్లర్లు, బాయిల్డ్ రైస్ మిల్లర్ల మధ్య వైరం కొనసాగుతోంది. రా రైస్ మిల్లర్లకు సీఎంఆర్ ఇవ్వడంలో తీవ్రం జాప్యం చేశారు. అధికంగా జరిమానాలు విధించారు. ఇక మిల్లర్ల అసోసియేషన్ నుంచి కూడా తమకు సరైన మద్దతు ఉండడం లేదని వేరుగా అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికీ ఈ సీజన్‌లో చాలా వరకు రా రైస్ మిల్లర్లకు సీఎంఆర్‌కు ట్యాగింగ్ రాలేదు.

అయినా పక్కదారి..!

ఈ సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో 21మిల్లులకు సీఎంఆర్ ఇచ్చేందుకు ట్యాగింగ్ ఇచ్చారు. మొదట బ్యాంకు గ్యారంటీలకు ముందుకు రాకపోవడంతో జాప్యం జరిగింది. క్రమంగా గ్యారంటీ ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. గ్యారంటీలు ఇస్తామని అండర్ టేకింగ్‌ఫాం రాసి ఇస్తున్నారు. వీరికి కొంత వ్యవధి ఇస్తూ ట్యాగింగ్ ఇస్తున్నారు. ఎలాంటి బకాయిలు లేని మిల్లర్లకు కేటాయించిన ధాన్యం విలువలో పదిశాతం గ్యారంటీ ఇవ్వాలి. బకాయిలు ఉంటే సీజన్, విలువను బట్టి గ్యారంటీ తీసుకోవాల్సి ఉంది. దీంతో ఆయా సీజన్ల బకాయిల ఆధారంగా పెనాల్టీ ఆ మేరకు మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అంత మొత్తంలో జరిమానాలు చెల్లించలేక ఇంకా కొందరు ముందుకు రాలేదు. దీంతో కొందరు తెరవెనక చక్రం తిప్పుతూ ట్యాగింగ్ తెచ్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బకాయిలు ఉన్న వారికి కొందరిపైనే చర్యలు తీసుకుని పక్షపాతం చూపిన అధికారులు, కొందరి విషయంలో ఉదారత చూపించడంపై మిల్లర్ల మధ్యే విభేదాలు వస్తున్నాయి. దీంతో కొత్తగా మిల్లులు ఉన్న వారికి బ్యాంకు గ్యారంటీలు ఇచ్చే స్తోమత లేకున్నా, ధాన్యం కేటాయింపులు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక కొందరు గతంలో తరహాలోనే ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తూ, బ్యాంకు గ్యారంటీలు ఇస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అన్ని మిల్లర్లపైనా ఒకే తీరుగా చర్యలు తీసుకోవాలని బాధిత మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలు సత్వరమే సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్, పరిహారం, రోడ్ల మరమ్మతులు తదితర సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా శాఖల్లో అర్జీలు పెండింగ్‌లో ఉంటున్నాయని, పూర్తి స్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- తమ భూమి పహాణి రికార్డులు మార్చారని, సవరించి న్యాయం చేయాలని జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం తిరుపతి కోరాడు.
- మంచిర్యాలలోని గర్మిళ్ల శివారులో సర్వే నంబరు 115 అసైన్డ్ భూమి మూడెకరాలు జిల్లా కేంద్రానికి చెందిన ఓ రిటైర్డు కానిస్టేబుల్ ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని మంచిర్యాలకు చెందిన చుంచు శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు.

బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి..



బెల్లంపల్లి ఏడీసీసీ బ్యాంకులో 2011లో ట్రాక్టర్‌పై రూ.5లక్షలు రుణం తీసుకున్నాను. ఇందుకోసం నా పేరిట ఉన్న 5.6ఎకరాల పట్టా పాస్‌బుక్ పెట్టాను. ఇందులోని 2.23 ఎకరాల భూమి అక్రమంగా ఇతరుల పేరిట పట్టా చేసుకున్నారు. బ్యాంకు మేనేజర్ గంగయ్య, సూపర్‌వైజర్ సూర్యభాస్కర్‌ను నిలదీస్తే తమదే తప్పిదం జరిగిందని, మీ పేరిట పట్టా చేసి ఇస్తామని, రుణం రూ.3లక్షలు తామే కట్టుకుంటామని చెప్పారు. నెన్నెల కోఆపరేటివ్ బ్యాంకులో రూ.లక్ష పంట రుణం తీసుకున్నారు. బ్యాంకు, బెల్లంపల్లి పీఏసీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.
– ఇందురి అమృత, గ్రామం, మం: రెబ్బెన

బిల్లులు విడుదల చేయాలి



నస్పూర్ మండలం వార్డు నంబరు 19లోని ప్రాథమిక పాఠశాలను మే 2022లో మరమ్మతు చేశాం. నిర్ణీత పనిని కేటాయించిన సమయంలోనే పూర్తి చేశాను. ఇందుకు సంబంధించిన బిల్లులు రావాల్సి ఉంది. అప్పులు చేసి పనులు చేపట్టాం. ఇప్పటికైనా బిల్లులు విడుదల చేయాలి.
– గోనే గంగాభవాని, గ్రామం: తీగల్ ఫహాడ్, మం: నస్పూర్

విద్యుత్ వైర్ల వల్ల ఇబ్బందులు



కోటపల్లి మండలం పారుపల్లి, లింగన్నపేట మధ్య వంతెన ఇరువైపుల ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్ వైర్ల మూలంగా బ్రిడ్జిపై నుంచి బస్సులు, పత్తి లోడు వాహనాలు, ధాన్యం, వరిగడ్డి తదితర లోడు తీసుక వచ్చే వాహనాలు రాలేకపోతున్నాయి. పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ వైర్లు తొలగించాలి. – మంత్రి రామయ్య, లచ్చన్న, బీజేపీ నాయకులు

వేతనాలు చెల్లించాలని ధర్నా



ధర్నాలో కార్మికులు, ఐఎఫ్‌టీయూ నాయకులు

ప్రీ మెట్రిక్ హాస్టళ్ల డే, నైట్ వాచ్‌మెన్, కుక్, కామటి, అవుట్ సోర్సింగ్ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రీమెట్రిక్ హాస్టల్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బ్రహ్మానందం మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతీ నెల కార్మికుల ఖాతాల్లో నేరుగా ట్రెజరీ నుంచి వేతనాలు, ఇతర బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అరుణ, ఐఎఫ్‌టీ యూ నాయకులు వెంకటేష్, సంతోష్, విజయ్, రాజన్న, సునిత, లత, ప్రమీల, స్వర్ణలత, లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన గ్రూప్–2 పరీక్షలు

- రెండోరోజు 48.8శాతం హాజరు



నస్పూర్‌లో హాల్ నంబర్ల పరిశీలనలో అభ్యర్థులు

మంచిర్యాలఅగ్రికల్చర్: టీజీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెండ్రోజులపాటు నిర్వహించిన పరీక్షలు సోమవారం ముగిశాయి. జిల్లాలోని మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్ మండలాల పరిధిలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండో రోజు సోమవారం 14,951 మంది అభ్యర్థులకు గాను 7,301 మంది హాజరు కాగా 7,650 మంది గైర్హాజరయ్యారు. 48.8 హాజరు శాతం నమోదైంది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పేపర్–3(ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్), మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ పరీక్షలు కొనసాగాయి. 9.30గంటల నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. పరీక్ష రాయడానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు మహిళా అభ్యర్థులకు చంటిపిల్లలు ఉండడంతో వారికి సహాయకులుగా కుటుంబ సభ్యులు వచ్చారు. అభ్యర్థుల సౌకర్యార్థం తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, రవాణా ఇతర సౌకర్యాలు కల్పించారు. జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, మందమర్రిలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పరిశీలించి పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. బందోబస్తు మధ్య ఓఎంఆర్ షీట్లను తరలించారు.

సంస్థ స్థితిగతులపై అవగాహన కల్పించాలి



బహుమతి అందిస్తున్న జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ స్థితిగతులపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మల్టీ డిపార్టుమెంట్ కమిటీ సమావేశాల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం నుంచి గనులు, డిపార్టుమెంట్లపై మల్టీడిపార్టుమెంట్ కమిటీ సమావేశాలు ఈ నెల 21వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ జీవితంలో భాగం కావాలి

శ్రీరాంపూర్: రక్షణ నిజ జీవితంలో భాగం కావాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గనిపై 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. రక్షణ తనిఖీ బృందం సభ్యులు గనిని సందర్శించి రక్షణ చర్యలను పరిశీలించారు. ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. 2022లో జరిగిన 54వ వార్షిక రక్షణ వారోత్సవాల్లో గ్రూప్ 2 గనుల్లో అండర్ గ్రౌండ్ మైన్స్ విభాగంలో ఓవరాల్‌గా ద్వితీయ స్థానం సాధించినందుకు గని అధికారులకు బహుమతి అందజేశారు.

బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ మైసూర్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని కృష్ణ కాలనీ శివాలయం మైదానంలో జిల్లా స్థాయి బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలను బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ యస్.మైసూర్ సోమవారం ప్రారంభించారు. సబ్ జూనియర్, సీనియర్ స్థాయిలో క్రీడాకారులను ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 20న హైదరాబాదులోని షేక్‌పేట్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాదం రవీందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మంతెన మల్లేష్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంగడి రాజేష్, నాయకులు పంబాల ఎర్రయ్య, రాజునాయక్, పాదం మహేందర్, బరుపటి మారుతి, కోచ్‌లు జగత్ సాయి, శ్రీకాంత్, సందీప్, రంజిత్, తిరుపతి పాల్గొన్నారు.

18న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్: ఈ నెల 18న మంచిర్యాలలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా జూనియర్స్ కబడ్డీ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామచందర్ తెలిపారు. ఎంపికైన బాలికల జట్టు మల్కాజిగిరి జిల్లా హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో, బాలురు జట్టు జనగామ జిల్లాలోని క్రిస్టియన్ హైస్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు మంచిర్యాల ట్రినిటీ హైస్కూల్‌లో పీఈటీ రవీందర్‌కు రిపోర్ట్ చేయాలని, 99637 19719 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

రియల్ ఢమాల్

- కుదేలైన స్థిరాస్తి వ్యాపారం
- ఉమ్మడి జిల్లాలో ప్లాట్ల విక్రయాలు డౌన్
- తగ్గిన డాక్యుమెంట్లు.. సర్కారు ఆదాయంపై ప్రభావం
- 'అనధికార' రిజిస్ట్రేషన్ల నిలుపుదలతోనే..
- మార్కెట్లో ఆర్థిక ఒడిదొడుకులూ కారణం



ఆదిలాబాద్‌లోని ఓ వెంచర్

సాక్షి, ఆదిలాబాద్: ఈ ఏడాది రియల్ ఎస్టేట్ రంగం పడిపోయింది. రిజిస్ట్రేషన్లలో మందగమనం చోటు చేసుకుంది. డాక్యుమెంట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోగా ఆ ప్రభావం ఆదాయంపై పడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని ముఖ్య పట్టణాల్లో నాన్ అగ్రికల్చర్ రిజిస్ట్రేషన్లు భారీగా పడిపోయాయి. ప్లాట్ల విక్రయాలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం.. అనధికార లేఅవుట్‌లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడమే. సుప్రీంకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ చర్యల కారణంగా ఈ పరిస్థితులు చోటు చేసుకున్నాయని స్థిరాస్తి వ్యాపారులు అభిప్రాయ పడుతున్నారు. మార్కెట్లో ఆర్థిక ఒడిదొడుకులు కూడా కారణం అన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మొత్తంగా ప్రభుత్వానికి అత్యధిక ఆదాయాన్నిచ్చే వనరుల్లో ఒకటైన రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి ఈ ఏడాది ఆదాయం తగ్గుముఖం పట్టింది.

వ్యవసాయ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను రెవెన్యూశాఖ తహసీల్దార్లు చేపడుతుండగా, నాన్ అగ్రికల్చర్ భూములను రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, భైంసా, ఖానాపూర్, లక్సెట్టిపేట, మంచిర్యాల, ఆసిఫాబాద్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాల్లో ప్లాట్ల క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి.

కారణాలు ఇవి..

పట్టణాల్లో అనధికారిక లేఅవుట్లు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయి. ఏళ్లుగా ఈ లేఅవుట్లలో ప్లాట్ల క్రయ విక్రయాలు కొనసాగుతూ వచ్చాయి. దీంతో ప్రభుత్వానికి ఆదాయం భారీగా లభించింది. 2019లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 257ను తీసుకువచ్చింది. ఆ ప్రకారం డీటీసీపీ, ఎల్‌ఆర్‌ఎస్ లేనటువంటి ప్లాట్ల రిజిస్ట్రేషన్ల విషయంలో నిబంధనలను అమలు చేసింది. ఆ జీవో తర్వాత పలువురు ప్లాట్ల విక్రయదారులు హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో ఆ తర్వాత కూడా రిజిస్ట్రేషన్లు జరుగుతూనే వచ్చాయి. 2021 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు, ఆదాయం గణనీయంగా లభించింది. ఆ తర్వాత సంవత్సరాల్లో డాక్యుమెంట్ల సంఖ్యతోపాటు ఆదాయం క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈఏడాది గణనీయంగా తగ్గింది. సుప్రీంకోర్టు ఆదేశాలు, కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 257 అమలును కఠినతరం చేయడంతో ఈ ఏడాది మార్కెట్లో ప్లాట్ల క్రయ విక్రయాల్లో మందగమనం స్పష్టంగా కనిపిస్తుంది. ఆదిలాబాద్‌లో రాజీవ్ స్వగృహ ప్లాట్ల విక్రయాలు పెద్ద ఎత్తున జరగడం, ఆ ఆదాయం నేరుగా ప్రభుత్వానికే చేరడంతో మార్కెట్లో ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయి. ఇది కూడా ఆదిలాబాద్‌లో ఆదాయం తగ్గడానికి ఒక కారణంగా నిలుస్తుంది. మార్కెట్లో ఆర్థిక ఒడిదొడుకులు కూడా ప్లాట్ల విక్రయాలు గణనీయంగా తగ్గడానికి ఒక కారణంగా రియల్ ఎస్టేట్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో గత నాలుగేళ్లలో రిజిస్ట్రేషన్ శాఖకు సమకూరిన ఆదాయం వివరాలు (రూ.కోట్లలో)

జిల్లా	2021	2022	2023	2024
ఆదిలాబాద్	87.86	79.80	62.35	35.35
నిర్మల్	49.04	48.92	64.22	29.74
మంచిర్యాల	44.28	76.93	72.51	59.98
కుమురంభీం	55.91	79.37	59.59	04.9

తగ్గిన డాక్యుమెంట్ల సంఖ్య..

- ఆదిలాబాద్ జిల్లాలో 2021లో 16,112 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు కాగా, 2022లో 12,280, 2023లో 13,327, 2024లో 10,070కి పడిపోయింది.
- నిర్మల్‌లో 2020–21లో 17,788 డాక్యుమెంట్లు కాగా, 2022లో 16,009, 2023లో 18,695 కాగా, 2024లో 13,660కి తగ్గింది.
- మంచిర్యాలలో 2021లో 18,260 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా, 2022లో 23,326 డాక్యుమెంట్లు, 2023లో 26,956 నమోదు కాగా, ఈ ఏడాది మాత్రం 17,883కు తగ్గిపోయింది.
- కుమురంభీం ఆసిఫాబాద్‌లో 2021లో 2,413, 2022లో 2,810, 2023లో 2,385, 2024లో మాత్రం 1,884కు తగ్గింది. ఈ ప్రభావం ఆదాయంపై పడింది. గణనీయంగా రాబడి తగ్గింది.

హెచ్చుతగ్గులు సహజమే..



రియల్ ఎస్టేట్ వ్యాపారంలో హెచ్చుతగ్గులు సహజమే. ఈ ఏడాది డాక్యుమెంట్ల సంఖ్య తగ్గింది. ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం చూపింది. మార్కెట్లో ఒడిదొడుకులు తగ్గితే డాక్యుమెంట్ల సంఖ్యతో పాటు ఆదాయం పెరుగుతుంది.
– ఎం.రవీందర్‌రావు, డీఆర్, జిల్లా రిజిస్ట్రార్, ఆదిలాబాద్

అనధికార లేఅవుట్లలో రిజిస్ట్రేషన్లు నో..



అనధికార లేఅవుట్లలో రిజిస్ట్రేషన్లు కొంత కాలంగా జరగడం లేదు. దీంతో మార్కెట్లో ప్లాట్ల విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. పాత లేఅవుట్లకు డీటీసీపీ అప్రూవల్ లేవు. జీవో 257 అమలు కంటే ముందు ఏర్పడిన ఈ లేఅవుట్లలో గతంలో ఒకరి నుంచి మరొకరికి ప్లాట్ల విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం డీటీసీపీ అప్రూవల్ ఉన్న లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు మాత్రమే చేస్తుండడంతో ప్రభావం కనిపిస్తుంది.
– శ్రీధర్, డాక్యుమెంట్ రైటర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వేంపల్లిలో నివాసం ఉంటున్న అల్లాడి ఆశాజ్యోతి మంచిర్యాల ఐడీఓసీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీ గురువారం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న బంధువుల గృహప్రవేశానికి వెళ్లి తిరిగి ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి ఇంట్లో చూడగా డ్రెస్సింగ్ టేబుల్ లాకర్‌లోని 11.50 తులాల బంగారం, 35 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. సోమవారం ఆశాజ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి యత్నం.. నిందితులకు జైలుశిక్ష

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్ (ఖానాపూర్) ఎస్‌బీఐ తాళాలు పగులగొట్టి 2017లో చోరీకి యత్నించిన ఇద్దరు నిందితులకు సోమవారం ఖానా పూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ ఆరు రోజుల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధించారు. 7, ఆగస్టు, 2017న కడెం మండలం మాసాయిపేట్‌కు చెందిన డి. ఉషన్నతో పాటు పెత్తరుపు గ్రామానికి చెందిన పీ. ప్రేమ్‌సాగర్‌లు ఖానాపూర్‌లోని బ్యాంకు తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. అప్పటి ఎస్సై వినయ్ వారిపై కేసు నమోదు చేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఏపీపీ దేవేందర్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా, విచారించిన జడ్జి నేరం రుజువు కావడంతో జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్, కోర్టు లైజనింగ్ అధికారి మనిరామ్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు



పేకాటరాయుళ్లతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కాసిపేట: మండలంలోని కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధి చిన్నదర్మారం అటవీ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు చేసి పేకాట ఆడుతున్న ముత్యంపల్లి, కాసిపేట గ్రామాలకు చెందిన ఎగ్గే రాజ్ కుమార్, వే ల్పుల సతీశ్, షేక్ అహ్మద్, ఎండీ యాకిన్, మారం శంకర్, సూరం శ్రీనివాస్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.13,220ల నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా
- ముగిసిన రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: సైన్స్‌పై ఆసక్తి పెంచుకొని విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా కొనసాగాయి. ఇందులో భాగంగా సోమవారం స్థానిక టీటీడీసీలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు టెలిస్కోప్, మైక్రోస్కోప్, సైన్స్ కిట్, సైన్స్ బుక్స్ తదితర పరికరాలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 320 మంది విద్యార్థులు, 120 మంది గైడ్ టీచర్లు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న సైన్స్ పరిజ్ఞానాన్ని వెలికి తీయాలని సూచించారు. మూఢనమ్మకాలు వీడి సైన్స్ వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ, కార్యదర్శి రవీందర్ రెడ్డి, ప్రొఫెసర్లు లక్ష్మారెడ్డి, రాంచంద్రయ్య, బీఎన్ రెడ్డి, కోయ వెంకట్‌రావు, శ్రీకాంత్, వరప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉ మాకాంత్, ఊశన్న, లింగారెడ్డి, గంగన్న, సంతోష్, లింగన్న, నాగరాజు, సైన్స్ అధికారి రఘురమణ, ఉ పాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజేతలు వీరే..

తెలుగు మీడియం కేటగిరీలో..

బహుమతి	పాఠశాల
ప్రథమ	జెడ్పీహెచ్ఎస్ ఇర్విన్(రంగారెడ్డి)
ద్వితీయ	జెడ్పీహెచ్ఎస్, పాలవరం (సూర్యపేట)
తృతీయ	జెడ్పీహెచ్ఎస్ కిష్టాపూర్ (మంచిర్యాల)
కన్సోలేషన్:	జెడ్పీహెచ్ఎస్ కోటగిరి(నిజామాబాద్), జెడ్పీహెచ్ఎస్ కొల్తూర్ (మెద్చల్)

ఇంగ్లిష్ మీడియం విభాగంలో..

ప్రథమ	జెడ్పీహెచ్ఎస్ చిట్యాల(మహబూబాబాద్)
ద్వితీయ	జెడ్పీహెచ్ఎస్ ఏడునూతుల(జనగాం)
తృతీయ	జెడ్పీహెచ్ఎస్ బాచుపల్లి(మల్కాజిగిరి)
కన్సోలేషన్	జెడ్పీహెచ్ఎస్, బోడుపల్లి(మహబూబ్‌నగర్), జెడ్పీహెచ్ఎస్ పీచర (హన్మకొండ), జెడ్పీహెచ్ఎస్ కొండమానపల్లి(నల్గొండ)

రెసిడెన్షియల్ విభాగంలో..

ప్రథమ	జవహర్ నవోదయ విద్యాలయం (ఖమ్మం)
ద్వితీయ	టీజీఆర్ఎస్‌జేసీ బాలుర తుంగతుర్తి (సూర్యపేట)
తృతీయ	టీజీఎంఆర్ఎస్ లింగంపేట్ బాలుర (కామారెడ్డి)
కన్సోలేషన్	ఎంజేపీ టీబీసీడబ్ల్యూఆర్ఎస్ (బాలికలు) బూత్‌పూర్(మహబూబ్‌నగర్), ఎంజేపీ టీబీసీడబ్ల్యూఆర్ఎస్(బాలుర) దంతాలపల్లి(మహబూబాబాద్), టీజీడబ్ల్యూఆర్ఎస్‌జేసీ(బాలుర)మడికొండ(హన్మకొండ)

ప్రైవేట్ పాఠశాలల విభాగంలో..

ప్రథమ	ఢిల్లీ పబ్లిక్ స్కూల్(హన్మకొండ)
ద్వితీయ	జయ హైస్కూల్ (సూర్యపేట)
తృతీయ	రత్నం గ్లోబల్ పాఠశాల(కామారెడ్డి)
కన్సోలేషన్	ఏకశిల పబ్లిక్ స్కూల్ (జనగాం), సెయింట్ ఆంటోని హైస్కూల్(సంగారెడ్డి), ఠాగూర్ హైస్కూల్ (రంగారెడ్డి)

వేర్వేరు ప్రమాదాల్లో గాయపడ్డ వ్యక్తులు మృతి



మధు (ఫైల్)



శ్రీనివాస్ (ఫైల్)

ముథోల్: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో బస్సు ఢీ కొట్టి తీవ్రంగా గాయపడ్డ దత్తు (మధు)(65) సోమవారం చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దత్తు బస్టాండ్ సమీపంలో బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అంబులెన్సులో భైంసా ఏరియాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా సోమవారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: బైక్‌పై వెళ్తుండగా అడవి పందులు ఢీకొని గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పది రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన బ్రహ్మదండి శ్రీనివాస్ (34), అక్షయ్ కుమార్‌లు ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం కడెం మండలంలోని బుట్టాపూర్ వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో నచ్చన్ఎల్లాపూర్ వద్ద అడవి పందులు ఢీకొట్టాయి. దీంతో బైక్‌పై నుంచి కింద పడడంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా, అక్షయ్‌కుమార్ చేయి విరిగింది. వెంటనే శ్రీనివాస్‌ను నిర్మల్ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం హైదరాబాద్‌కు తరలించారు. కాగా సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాస్‌కు తల్లి శ్యామల, భార్యతోపాటు పదేళ్లలోపు వయస్సు ఉన్న ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రక్తహీనతతో గిరిజన యువతి మృతి



కుమ్ర భీమేశ్వరి (ఫైల్)

ఇంద్రవెల్లి: రక్తహీనత, అనారోగ్యంతో కొలాం గిరిజన యువతి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని మర్కగూడ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్కగూడ గ్రామానికి చెందిన కుమ్ర సోనేరావ్ -శాంతబాయి దంపతుల కుమార్తె కుమ్ర భీమేశ్వరి (20) గతేడాది ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. రక్తహీనత, తరచూ అనారోగ్యానికి గురవడంతో ఉన్నత విద్యకు సైతం దూరమైంది. కుటుంబసభ్యులు పలు ఆసుపత్రులకు తరలించి వైద్యం అందించినా ఆమె ఆరోగ్యం కుదుటపడలేదు. కాగా ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారు జామున ఇంట్లోనే భీమేశ్వరి మృతి చెందింది.

ఫిట్స్‌తో బాలుడు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సరదాగా ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలుడిని కాలం కాటేసింది. ఇటీవలే మృత్యుబారి నుంచి బయటపడిన బాలుడు ఈసారి మాత్రం తప్పించుకోలేకపోయాడు. ఫిట్స్‌తో నాలుగేళ్ల బాలుడు సోమవారం మృత్యుఒడిలోకి చేరడంతో ఆ గ్రామంలో విషాధ చాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన మాడుగుల సురేందర్ కార్పెంటర్ పని చేసుకుంటూ భార్య అరుణ, కుమారులు సాయిప్రణవ్, రుద్వేద్‌లతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. చిన్న కుమారుడు రుద్వేద్ సోమవారం ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఒక్కసారిగా ఫిట్స్ వచ్చింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రుద్వేద్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సురేందర్ ఫిర్యాదు మేరకు ఎస్సై గోపతి సురేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇటీవల రుద్వేద్ ఓ నీటి సంపులో పడగా స్థానికులు కాపాడారు. అప్పుడు ప్రాణాలు దక్కించుకున్న బాలుడు ఫిట్స్‌తో మృతి చెందడంతో అయ్యో పాపం రుద్వేద్ అంటూ గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు.

మహిళ అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఇచ్చోడకు చెందిన మహిళ అదృశ్యమైన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇచ్చోడలోని గాంధీనగర్‌కు చెందిన మౌనిక సిద్దిపేటలో నివాసం ఉంటుంది. ఆదివారం సిద్దిపేట నుంచి పుట్టినిల్లు ఆదిలాబాద్‌కు బస్సులో బయల్దేరింది. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి వద్దకు రాత్రి 8 గంటలకు చేరుకుని తన తండ్రికి ఫోన్ చేసి పెద్ద కూతురును అప్పగించింది. చిన్న కూతురుకు ఆరోగ్యం బాగాలేదని, రిమ్స్‌లో చూపిస్తానని చెప్పి ఆస్పత్రిలోనికి వెళ్లింది. ఎంతసేపైనా మౌనిక తిరిగి రాలేదు. ఎక్కడా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం తండ్రి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

నేరడిగొండ: మద్యానికి బానిసైన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చించోలి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 14న ఆత్రం కిరణ్ కుమార్ (26) మద్యం సేవించగా తండ్రి కిష్టు మందలించాడు. దీంతో కిరణ్ కుమార్ వ్యవసాయ చేనుకు వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోశాలలో కొండచిలువ



గోశాలలో పట్టుకున్న కొండచిలువ

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్‌లో సత్యనారాయణరెడ్డి అనే వ్యక్తికి చెందిన గోశాలలో సోమవారం అటవీ అధికారులు కొండచిలువను పట్టుకున్నారు. గోశాలలో కొండ చిలువ ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే డిప్యూటీ రేంజ్ అధికారి పి.ప్రభాకర్, బేస్‌క్యాంపు వాచర్ దాసరి అశోక్‌లు వెళ్లి చాకచక్యంగా కొండచిలువను సంచిలో బంధించారు. అనంతరం సమీప అడవిలో దాన్ని వదలిపెట్టారు.

యువతిని వేధించిన ఒకరి రిమాండ్

ఖానాపూర్: ప్రేమ, పెండ్లి పేరుతో మైనర్ బాలికను వేధించిన కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన జీ. బిగ్గు అలియాస్ వినిత్ అనే వ్యక్తి తన కూతురిని వేధిస్తున్నాడని బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారురు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.


జాతీయ సోషల్ మీడియా కన్వీనర్‌గా తిరుపతి



మిట్టపల్లి తిరుపతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) మొట్టమొదటి అఖిల భారత వ్యవస్థాపక మహాసభలు ఈ నెల 14, 15వ తేదీల్లో విజయవాడలో జరగ్గా హాజీపూర్ మండలానికి చెందిన యూఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతిని జాతీయ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

గ్రూప్- 2 పరీక్షలో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే ప్రస్తావన



కావేటి సమ్మయ్యపై వచ్చిన ప్రశ్న

కౌటాల: టీజీపీఎస్సీ గ్రూప్ 2 పరీక్షలో భాగంగా రెండోరోజు సోమవారం ప్రశ్నపత్రంలో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే దివంగత కావేటి సమ్మయ్యపై ప్రశ్న కనిపించింది. 'తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటున్న విద్యార్థుల యోగక్షేమం కోసం సిర్పూర్-కాగజ్‌నగర్ నివాసి అయిన కావేటి సమ్మయ్య 'అపమృత్యు హోమం' అనే వైదిక క్రతువును నిర్వహించారు.' అని ప్రస్తావించారు. ఈ ప్రశ్నకు జిల్లాకు చెందిన అభ్యర్థులు ఉత్సాహంగా సమాధానమిచ్చారు. మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య ప్రస్తావన గ్రూప్ -2 పరీక్షలో రావడంతో సమ్మయ్య అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్న సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

చిరుత సంచారం!

సారంగపూర్: మండలంలోని ధని గ్రామ సమీపంలో గల అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. సోమవారం సాయంత్రం పశువులను మేతకు తీసుకెళ్లిన పశువుల కాపరులకు అడవిలో చిరుత కన్పించడంతో భయంతో పరుగులు తీశామన్నారు. అటవీ అధికారులకు సమాచారమివ్వగా అటవీప్రాంతానికి వారు చేరుకున్నారు. చిరుత అడుగుజాడలను వెతుకుతున్నట్లు అటవీ సెక్షన్ అధికారి రషీద్ తెలిపారు.

కదం తొక్కిన కొలాం ఆదివాసీలు

- మన్నెవార్లకు కొలవార్ పదం తొలగించాలని డిమాండ్
- ఐటీడీఏ ఎదుట ధర్నా



రహదారిపై బైఠాయించిన కొలాం ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: మన్నెవార్లకు కేటాయించిన కొలవార్ పదం తొలగించాలని డిమాండ్ చేస్తూ కొలాం ఆదివాసీ గిరిజనులు కదం తొక్కారు. సోమవారం ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి భారీగా తరలివచ్చి ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టేకం భాస్కర్, గౌరవ అధ్యక్షుడు ఆత్రం బాలేరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నగేశ్, అధ్యక్ష, కార్యదర్శులు గోవింద్‌రావు, దిలీప్, ఆత్రం శ్రీను, ఆత్రం మహేశ్‌లు మాట్లాడుతూ ఏళ్లుగా నివాసం ఉంటున్న తాము మాతృభాష కొలాం మాట్లాడుతున్న తరుణంలో తమను కొలవార్‌గా ప్రభుత్వం గుర్తించిందన్నారు. కాని ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన్నెవార్లకు కేటాయించిన కొలవార్ పదాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. 2021లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మన్నెవార్లను పీవీటీజీలుగా గుర్తింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని, ఇప్పటి వరకు మన్నెవార్లకు కొలవార్‌గా జారీ చేసిన సర్టిఫికెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ధర్నా చేస్తున్న వారితో మాట్లాడారు. సమస్యపై చర్చించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆందోళన సుమారు గంటన్నర పాటు సాగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ధర్నాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా కొలాం ఆదివాసీ, ఆయా ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'సంతకాల సేకరణలో కార్మికులు పాల్గొనాలి'



మాట్లాడుతున్న రాజారెడ్డి

జైపూర్: కార్మికుల సొంతింటి కల, ఇతర అలవెన్స్‌లు, ఐటీ మాఫీ ఇతర సమస్యల పరిష్కారానికి యూనియన్లు, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, సీఎం రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చి ఎలాంటి కార్యాచరణ చేపట్టడం లేదని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఎంకు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై సోమవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సీఎంకు సంతకాల సేకరణ కార్యక్రమంలో కార్మికులు పాల్గొనాలన్నారు. అంతకముందు సంతకాల సేకరణకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఫిట్ సెక్రెటరీ సిరికొండ శ్రీనివాస్, బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంగళ శ్రీనివాస్, చంద్రశేఖర్, సుధాకర్, నవీన్, వెంకట్‌రెడ్డి, శంకర్, వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలు స్వీకరించారు. గాదిగూడ మండలం శివన్నూర గ్రామానికి చెందిన రాజు తనకు ఆర్థికసాయం చేయాలని, ఉట్నూర్ మండలం పిట్టగూడ గ్రామానికి చెందిన పద్మ అంగన్వాడీ సెంటర్‌లో ఉద్యోగం కల్పించాలని, మంచిర్యాల మండలానికి చెందిన లింగవ్వ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. ఏపీవో వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఐసీడీఎస్ ఉమాదేవి, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మహిళలు ఆర్థికంగా రాణించాలి

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని కేబీప్రాంగణంలో మహిళా సంఘాల ద్వారా పెంచుతున్న కోడి పిల్లలను పెరటి కోళ్ల పెంపకం లబ్ధిదారులకు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. నేడు కోళ్లకు బహిరంగ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలని సూచించారు. ఉద్యానవన అధికారి సందీప్, ఐకేపీ ఏపీఎం అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం సిలబస్ పూర్తి చేయాలి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీడీలు, డీటీడీవోలు, ఏటీడీవోలు, హెచ్ఎంలు, హెచ్‌డబ్ల్యూవోలతో కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సమీక్ష సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల కోసం 100 రోజుల కార్యచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. వంద శాతం సిలబస్ పూర్తి అయ్యే విధంగా చూడాలని సూచించారు. విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తెలిపారు. ఏపీవో వసంత్‌రావు, ఏడీఎంవో కుడిమెత మనోహర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

- ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్/పాతమంచిర్యాల: ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం రూ. 18వేలుగా నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించి పని భారాన్ని తగ్గించాలని, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్, ప్రమోషన్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బస్సుయాత్ర రెండో రోజు సోమవారం కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ పట్టణంలోని ఛత్రపతి శివాజీ చౌక్ వద్ద ఆరె సంక్షేమ సంఘ భవనంలో, మంచిర్యాల జిల్లాకేంద్రంలోని హరిత ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఆశల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 15 నుంచి 31 వరకు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలమణి, పద్మ, సాధన, గంగామణి, నీలాదేవి, సునీత, స్వరూప, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ సభ్యులు కృష్ణమాచారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు



ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడుతున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: 100కు డయల్ చేయగానే వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పోలీసులు కాపాడిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక చున్నంబట్టివాడకు చెందిన మైదం పురుషోత్తం అనే యువకుడు కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి పిచ్చిగా వ్యవహరిస్తున్నాడు. నిత్యం మద్యం సేవించి ఇంట్లో గొడవ పడుతుండేవాడు. కాగా సోమవారం మద్యం మత్తులో కాలేజీరోడ్‌లోని ఎడ్లవాడ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా స్థానికులు 100కు డయల్ చేసి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన బ్లూకోట్ కానిస్టేబుళ్లు ప్రదీప్, సాయి పురుషోత్తంను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐ ప్రమోద్‌రావు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపించారు.

ప్రశంసాపత్రం అందుకున్న ఖానాపూర్ వాసి

ఖానాపూర్: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన ప్రపంచ ఆయుర్వేద సమ్మేళనంలో ఖానాపూర్‌కు చెందిన దేశాయ్ రాము ఆదివారం ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్నారు. అరుదైన వనమూలికలు గుర్తించడంతో పాటు సాంప్రదాయ వైద్యంలో నిష్ణాతులను పోత్సహించడంలో భాగంగా భారత ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో తాను అందజేస్తున్న వైద్యసేవలను గుర్తించి ఉత్తమ ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు రాము తెలిపారు. సదస్సులో తెలంగాణ పారంపర్య వైద్య మహాసంఘ అధ్యక్షులు యాత్రి మహారుషి, ప్రఖ్యాత వనమూలిక వైద్యులు సింహచలం లక్ష్మణ్‌స్వామి పాల్గొన్నారు.

నిప్పంటుకుని సామగ్రి దగ్ధం



కాలిపోయిన వంట సామగ్రి

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం రేకులషెడ్‌కు నిప్పంటుకుని గడ్డికట్టలు, వంట సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని బిలోలి గ్రామంలో సంజీవ్ అనే వ్యక్తికి చెందిన రేకులషెడ్‌లో బాగాపూర్ గ్రామానికి చెందిన సాయన్న అద్దెకుంటూ సాకలి భూమన్న వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. రేకులషెడ్‌లోని ఒకరూంలో సంజీవ్‌కు చెందిన గడ్డిని నిల్వ చేసుకోగా మరోవైపు ఉన్న రూంలో సాయన్న అద్దెకుంటున్నాడు. సోమవారం రేకులషెడ్‌కు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డి కట్టలు, సాయన్నకు చెందిన వంట సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. సమీపంలో ఉన్న వారు మంటలు వ్యాప్తి చెందకుండా ఆర్పివేశారు. దగ్ధమైన సామగ్రి విలువ రూ.80 వేల వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.